క్లుప్తంగా

ఆలయంలో 'ఆది' పూజలు



పూజల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్, నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లిలో పెద్దమ్మ తల్లిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు పెద్దమ్మ – పెద్దిరాజు కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పూర్మాని మంజుల, కాంగ్రెస్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మోర రాజు, సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, జిల్లా యూత్ నాయకుడు మునిగెల రాజు, సత్తు శ్రీనివాస్ రెడ్డి, సుద్దాల శ్రీనివాస్, కటకం రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నృత్య అధ్యాపకులకు ఆత్మీయ సన్మానం



వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని నృత్య కళానికేతన్ సేవా సంస్థ కార్యాలయంలో ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లాలోని 20 మంది నృత్య అధ్యాపకులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోశెట్టి మాట్లాడుతూ సాంస్కృతి కళలు కనుమరుగు కాకుండా చూసే బాధ్యత నృత్య అధ్యాపకులపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాసంస్థ అధ్యక్షుడు సావనపల్లి శ్రీనివాస్, కార్యదర్శి వారాల దేవయ్య, బొడ్డు రాములు, గుమ్మడి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

'మే డే విజయవంతం చేయాలి'

బోయినపల్లి: మే డేను విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాన్ని ఆదివారం మండలకేంద్రంలో హమాలీ సంఘం కార్మికుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. మేడే రోజున మండలకేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే జెండా ఆవిష్కరణకు పెద్దసంఖ్యలో కార్మికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, హమాలీ సంఘం అధ్యక్షుడు రాజ నర్సు, కార్మికులు నర్సయ్య, భూమయ్య, పి ట్టల జీవన్, గండి రాజమల్లు, గంగిపల్లి శంకర య్య, బోయిని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హరిత ప్రేమికుడికి జాతీయ అవార్డు

- మే 5న మంథనిలో అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన హరిత ప్రేమికుడు దుంపెన రమేశ్ మరో జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. మే 5న మంథనిలో ఆయన అవార్డును అందుకోనున్నారు. రమేశ్ గత 13 ఏళ్లుగా మండలంలోని పలుగ్రామాల్లో తన సొంత ఖర్చులతో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయడమే కాకుండా, తన ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచుతూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. పర్యావరణంపై రమేశ్ చేస్తున్న సేవలను గుర్తించిన శ్రీ గౌతమేశ్వర సాహితీ కళాసంస్థ జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. రమేశ్ అవార్డుకు ఎంపికవడంపై పలువురు హర్షం వ్యక్తంచేశారు.



రమేశ్

మడేలేశ్వర స్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీమడేలేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలిరాగా.. బైండ్ల వాళ్ల గాంగ్రింపులు, డప్పుచప్పుళ్ల మధ్య బోనాల జాతర సాగింది. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు షేక్ గౌస్, బండారి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బియ్యం వితరణ

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన వంగపల్లి ఐలయ్య అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి మండల శాలివాహన సంఘం నాయకులు పరామర్శించారు. శాలివాహన కుమ్మరి మండల సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం వితరణగా అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మండల అధ్యక్షుడు వంగపల్లి పర్శరాములు కోరారు. ఇక్కడ వంగపల్లి శ్రీనివాస్ దేవరాజ్, శోభన్, రవి, భూమలింగం యూత్ అధ్యక్షుడు రాము, నర్సయ్య, మనోహర్, మధు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో వార్డు కౌన్సిలర్..

సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని 34వ వార్డులో తవుటి లక్ష్మి మృతిచెందగా బాధిత కుటుంబానికి వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తన 50 కిలోల బియ్యం అందించారు. ఇక్కడ పెండం లక్ష్మీనారాయణ, సుంచు ప్రకాశ్, కోడం రాజు, మెడికల్ రమేశ్, తదితరులున్నారు.

పల్లె ప్రజలకు 'ఆయుష్మాన్' సేవలు



పోతుగల్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం



తెర్లుమద్ది ఉపకేంద్రంలో దంత వైద్య సేవలు

- ఆరోగ్య ఉపకేంద్రాల్లో 12 రకాల వైద్య చికిత్సలు
- జిల్లాలో 61 ఉపకేంద్రాలు
- మొదలైన 'ఆయుష్మాన్' వైద్యసేవలు

ముస్తాబాద్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ వైద్యసేవలు జిల్లా ప్రజలకు దరిచేరనున్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆయుష్మాన్ మందిర్ పేరుతో ఈ వైద్యసేవలు అందించనున్నారు. పల్లెల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో 12 రకాల వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

61 ఉపకేంద్రాల్లో..

జిల్లాలో 61 ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలు అందిస్తారు. ఈ మేరకు జిల్లా అధికారులు కేంద్రాల్లో పనిచేసే మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గ్రామీణులకు మెరుగైన, నాణ్యమైన చికిత్స అందించాలన్న లక్ష్యంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం 12రకాల వైద్యసేవలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జిల్లాలో దంత వైద్యశిబిరాలు నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రుల్లో పనిచేసే ప్రత్యేక వైద్యనిపుణులతో ఉపకేంద్రాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తారు. వారానికి ఒకరోజు ఉపకేంద్రాల్లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తారు. ఉపకేంద్రాల్లో రోగి సమస్య తీవ్రతను బట్టి జిల్లా ఆస్పత్రి లేదా ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తారు.

ఆరోగ్య సేవలివే..

గర్భిణి, ప్రసూతి సేవలు, నవజాత శిశువు, శిశువు ఆరోగ్య సేవలు, బాల్యం, కిశోర శిశుఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక, పునరుత్పత్తి ఆరోగ్య సేవలు, సంక్రమిత వ్యాధుల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, సాధారణ సంక్రమిత వ్యాధుల నిర్వహణ, సాధారణ రుగ్మతలకు ఔట్ పేషెంట్ సేవలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, నివారణ, నియంత్రణ, నిర్వహణ, ఉపశమనం, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, సాధారణ కంటి (ఈఎన్‌టీ) సేవలు, సాధారణ నోటి ఆరోగ్య సంరక్షణ, అత్యవసర వైద్యసేవలు, మానసిక ఆరోగ్య సమస్యల స్క్రీనింగ్, నిర్వహణ సవలు అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేక శిబిరాలు



జిల్లాలో ఆయుష్మాన్ వైద్య సేవలు అందించేందుకు అన్నిఏర్పాట్లు చేశాం. 61 ఉపకేంద్రాలను గుర్తించాం. 12 రకాల వైద్యసేవలను ప్రత్యేక శిబిరాల ద్వారా అందిస్తాం. వ్యాధి తీవ్రతను బట్టి జిల్లా ఆస్పత్రికి రోగులను తరలిస్తారు. ఇప్పటికే దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం.

– డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న కేటీఆర్, నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లిలో పెద్దమ్మతల్లిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ పెద్దమ్మ – పెద్దిరాజు కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలో పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బండి దేవదాస్, కోడూరి భాస్కర్, ఎంపీటీసీలు గుగ్గిళ్ల లావణ్య, కోడి అంతయ్య, మాజీ సర్పంచ్ కొయ్యడ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి



బోయినపల్లి: కొదురుపాకలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



వీర్నపల్లి: మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వాహించారు. అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, చెన్నాడి అమిత్‌కుమార్, మాజీ ఎంపీపీలు సత్తినేని భాగ్యలత, మాధవ్, మాజీ జెడ్పీటీసీ కొనుకటి లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని బండలింగంపల్లి, కిషన్‌దాస్‌పేట, సింగారం గ్రామాల్లో ఆదివారం వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ అభివృద్ధి కోసం వినోద్‌కుమార్‌కు ఓట్లు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు గుల్లపల్లి నర్సింహారెడ్డి, దేవరాజు, స్వామి, నారాయణరెడ్డి, అంజిరెడ్డి, బాల్‌రాజ్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని సీతారాం నాయక్ తండాలో ఆదివారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా తండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టెస్కాబ్ చెర్మన్ కొండూరు రవీందర్‌రావు హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలు ప్రారంభం

గంభీరావుపేట: మండలకేంద్రంలో రేణుకామాత (ఎల్లమ్మ) సిద్ధోగం వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదేళ్ల అనంతరం నిర్వహిస్తున్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గౌడ సంఘం నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఎల్లమ్మ గరుడను ఊరేగించారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న దయాకర్

చందుర్తి: బస్టాండ్‌లోని ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సీపీఐ(ఎంఎల్) జనశక్తి మాజీ దళ కమాండర్ కుమ్మరి దయాకర్ ఊరఫ్ రత్నాకర్ తెలిపారు. ఆదివారం మండలంలోని బండపల్లి బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు ముదరడంతో బస్టాండ్‌లో ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీడీసీ మాజీ అధ్యక్షుడు చంద్రయ్య, చార్వాక వృద్ధుల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి, సభ్యులు కటకం లచ్చయ్య, న్యాత రాజయ్య, తీపిరెడ్డి లక్ష్మారెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం



శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: కామారెడ్డి జిల్లా తాడ్వాయి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేటలో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ మృతిచెందాడు. 1995వ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్ గతంలో గంభీరావుపేట ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించాడు. శ్రీనివాస్‌గౌడ్ మృతిపై ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్, కోనరావుపేట ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హార్వెస్టర్ డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేట గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో హార్వెస్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన గాజుల పెద్ద బాలయ్య తన ద్విచక్రవాహనంపై రాచర్లగొల్లపల్లి నుంచి మల్లారెడ్డిపేటకు వెళ్తున్నాడు. కోరుట్లపేట శివారులో రోడ్డుపై ధాన్యం ఆరబెట్టారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న వరికోత యంత్రం (హార్వెస్టర్)డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. ప్రమాదంలో బాలయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాలయ్య కుమారుడు ముత్యం ఫిర్యాదు మేరకు మహారాష్ట్రకు చెందిన హార్వెస్టర్ డ్రైవర్ రాజబాబుపై కేసు నమోదు చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన రడం లింగయ్య (40) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగయ్య ఈనెల 24న రాత్రి బెజ్జంకి గుట్ట ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. కాగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

మే1 నుంచి పోలీస్ సమ్మర్ క్యాంపు

ఎల్లారెడ్డిపేట: వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని మే 1వ తేదీ నుంచి పిల్లల కోసం పోలీస్ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీ మైదానంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



కాంగ్రెస్ కండువా కప్పుతున్న కేకే మహేందర్‌రెడ్డి



ముస్తాబాద్: మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ ఆఫీస్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఆగమాగం చేసిందని విమర్శించారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాలు, రుణమాఫీ, దళితబంధు.. హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం ఇయ్యనే లేదని విమర్శించారు. 29న తంగళ్లపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేటల్లో రోడ్‌షో, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్లల్లో నిర్వహించే రోడ్‌షోలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గుండారం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు బోయిని బాలయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, గుండారం గ్రామ నాయకులు జజ్జరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌ను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని సింగిల్‌విండో మాజీ చైర్మన్ కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడెంలో పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క హామీని అప్పటి ప్రభుత్వం నేరవేర్చలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించాలన్నారు. కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ముస్తాబాద్‌లో సోమవారం జరిగే రాజేందర్ రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ అంజన్‌రావు, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, రాంరెడ్డి, కొండల్‌రెడ్డి, కిషన్‌రావు, ఎల్లాగౌడ్, సిద్దారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమణ, గిరి, ధర్మేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు మద్దతుగా ప్రచారం



ముస్తాబాద్: పోతుగల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్: కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం వస్తుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్, గూడెం, నామాపూర్‌లో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన నరేంద్ర మోదీకి అందరు మద్దతివ్వాలన్నారు. బీజేపీ కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, శ్రీనివాస్ రావు, మహేందర్, రమేశ్ రెడ్డి, యెల్ల గిరి, సంజీవ్, శంకర్, సంతోష్ రెడ్డి, కృష్ణ, వెంకటేశ్, జనార్దన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కేంద్రప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, ఈ ఎన్నికల్లో బండి సంజయ్‌కు ఓట్లువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. మండలంలోని వెంకటాపూర్, నారాయణపూర్, రాగట్లపల్లి, పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లో ఆదివారం ఆయన బండి సంజయ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మూడోసారి మోదీ ప్రధాని కావాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, నాయకులు మద్దుల బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, దేవేందర్ రెడ్డి, కిరణ్‌నాయక్, మినహాజ్ ఖాన్, బాలయ్య, రాజు, స త్యంరెడ్డి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్నిగ్రామాల్లో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు గునుకుల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ పథకాలను వివరిస్తూ బండి సంజయ్‌ను గెలిపించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సిరిసిల్ల ఎడ్యుకేషన్: సమావేశమైన పూర్వ విద్యార్థులు



సిరిసిల్ల ఎడ్యుకేషన్: పట్టణంలోని వెంకంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2009–10 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలోని శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు ఆదివారం పూర్వ ఉపాధ్యాయుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి విద్యాబోధన, ప్రస్తుత విద్యాబోధన గురించి చర్చించుకున్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేసి ప్రస్తుతం వేర్వేరు ఉద్యోగాల్లో స్థిరపడిన వారు తమ గత స్మృతులను నెమరు వేసుకున్నారు.

జిల్లాలో ముమ్మర తనిఖీలు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లాలో ఆపరేషన్ చబుత్రా పేరిట ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రాత్రి 10.30 గంటల వరకు వ్యాపార సముదాయాలు మూసివేయాలని, ఎవరూ రాత్రిళ్లు రోడ్లపై సంచరించవద్దన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఎన్నికల చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం అర్ధరాత్రి వరకు జిల్లావ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో గస్తీ నిర్వహించి అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతున్న సుమారు 256 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అనుమానిత 81ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. మద్యంతాగి రోడ్లపై రాష్ డ్రైవింగ్, అనుమానాస్పదంగా తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్, రాజన్నపేట లో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ పృథ్వీధర్ గౌడ్ ఆదివారం తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.